క్లుప్తంగా

పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

నారాయణపేట టౌన్: పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రాం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవ్వరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. జూలై 3న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కాశప్ప, బీసీ కాలనీ కమిటీ సభ్యులు మల్లప్ప, వెంకటయ్య, పుల్లయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తూ సంబురాలా?

నారాయణపేట టౌన్: ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేస్తూ సంబురాలు చేయడం ఏమిటని బీసీసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాల్‌రాజ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించాలన్నారు. దామరగిద్ద మండల అధ్యక్షుడిగా భాస్కర్ యాదవ్, పేట మండల ఉపాధ్యక్షుడుగా బాలు యాదవ్, కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి జేవీ రావు నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల అందజేత

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో త్రైత సిద్ధాంత గ్రంథాలను మంగళవారం గ్రామస్తులను అందజేశారు. జిల్లా కన్వీనర్ నాగ్యానాయక్ మాట్లాడుతూ గ్రంథాలపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు.కార్యక్రమంలో తిరుపతయ్య, కొండానెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, వేంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, రజిత పాల్గొన్నారు.

మండల ఏర్పాటుతో అన్ని రంగాల్లో అభివృద్ధి

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహారదీక్షలు 42వ రోజుకు చేరుకున్నాయి. అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. మండల ఏర్పాటుతో భవిష్యత్‌లో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని, విద్యారంగంలో ఇంటర్‌తో పాటు వివిధ విద్యాలయాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాస్, రాము, కాశీనాథ్, బలరాం, చెన్నప్ప, నర్సింహులు, రాజు, బాలప్ప, రాములు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత

ఊట్కూరు: నిత్యం ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముగ్దుంపురం, బిజ్వార్ పాఠశాలలో ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యానంతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ధనుంజయ్య, సర్పంచ్ సావిత్రమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆశప్ప, కృష్ణయ్యగౌడ్, ఉపాధ్యాయులు మోహన్‌రావు, అపర్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో పోలేరమ్మ జాతర మంగళవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కురుమ కులస్తులు అంబలిని నైవేద్యంగా సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించారు. అమ్మవారికి మేకలు, గొర్రెలు, కోళ్ళు సమర్పించారు.

తహసీల్దార్‌గా జయరాములు



మద్దూరు: మండల తహసీల్దార్‌గా ఎస్ జయరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ చింత రవి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జయరాములు మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు.

వర్షాలు కురవాలని అమ్మవారికి పూజలు

మాగనూర్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కృష్ణా మండలం ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గ్రామస్తులు మండలంలోని నల్లగట్టు దగ్గర వెలసిన నల్లగట్టుమారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు పండాలని కోరుకునట్లు వారు పేర్కొననారు. ఈ సందర్భంగా అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించారు.



లక్ష్మీపూర్‌లో విద్యార్థుల నృత్యాలు



మాగనూర్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న నాయకులు



మక్తల్‌లో..



కృష్ణలో..

ఘనంగా విద్యా దినోత్సవం



కర్నిలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నారాయణపేట రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంఓ విద్యాసాగర్, జీసీడీఓ పద్మనళిని, టీచర్ యూనియన్ నాయకులు జనార్దన్‌రెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి, రెడ్డప్ప, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోస్గి: గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులందరికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన ఊరు..మన బడి' పథకంలో ఎంపికై కొత్త హంగులు దిద్దుకున్న నాచారం ప్రాథమికోన్నత, చెన్నారం ప్రాథమిక, కోస్గి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన విద్యాదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాలు, డిజిటల్ తరగతి గదులను ప్రారంభించి ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. గురుకుల పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ. 1.25 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, ఆయా గ్రామాల సర్పంచులు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

● దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాదినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం కళాశాల అధ్యాపక బృందం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. గత 28 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకులను ముఖ్యమంత్రి కేసీఆర్ రెగ్యులరైజ్ చేశారని అన్నారు. ఉత్సవాల సందర్భంగా జెండావిష్కరణ చేసి ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అధ్యాపకులు జ్ఞానేశ్వర్, పరశురాములు, షేక్ భాషావలీ, శంకర్ రావు, ఎల్లయ్య, కల్పన, మయూరి, అర్షియా బేగం, బందెప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

మద్దూరు: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతి గదులను, గ్రంథాలయం భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మన ఊరు– మన బడి క్రింద ఈ పాఠశాలకు రూ.84 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. గురుకులాలు, జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసినా ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామక్రిష్ణ, ఎంఎసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, ఎంఈఓ గోపాల్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాగనూర్(మక్తల్): ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ వనజమ్మ మంగళవారం మక్తల్ మండలంలోని కర్ని, ఉప్పర్‌పల్లి , మంథన్ గోడ్ గ్రామాలలోని పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు మన బడి పథకం క్రింద ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అన్నారు. అనంతరం మంథన్‌గోడ్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఊట్కూర్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా ఊట్కూర్ బాలుర ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో ముంజూరైన రూ.1.20 కోట్ల వ్యయంతో పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని జీపీఎస్‌లో విద్యా దినోత్సవం సందర్భంగా సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి లైబ్రరీని ప్రారంభించారు. విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాగనూర్(కృష్ణ): మండలంలోని వేడుకల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖ, వైస్ ఎంపీపీ రవి, ఎంపీటీసీలు, ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, హెచ్‌ఎం నవీన్‌కుమార్, దత్తత్రి పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలో విద్యాదశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ర్యాలీలు, జాతీయ పతాక ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ నర్సప్ప, జీహెచ్‌ఎం బాలాజీ, జ్యోతి, విశ్వనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● మండలంలోని గడిమున్కన్‌పల్లిలో భాగంగా పబ్లిక్ రీడింగ్ రూం భవనాన్ని ఎంపీపీ నర్సప్ప ప్రారంభించారు. ఎంపీటీసీ లక్ష్మమ్మ రాంచందర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మక్తల్: తెలంగాణ విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఎస్సీవాడ ఎంపీపీఎస్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. హెచ్‌ఎం గోపాల్, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేష్, వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకం ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు.

మాగనూర్: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.



నాచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



మరికల్‌లో..



జాజాపూర్‌లో..



గడిమున్కన్‌పల్లిలో..



ఊట్కూర్‌లో..



క్యాతన్‌పల్లిలో..



కడంపల్లి పాఠశాలలో విద్యాదినోత్సవం



మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో..



ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

ఉపా కేసులు ఎత్తివేయాలి

మాగనూర్(మక్తల్): ప్రశ్నించేవారిపై ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని వివిధ రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ మెంబర్ గోవింద్‌రాజు, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక పాలనను ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నిస్తున్న ప్రొఫెసర్లు, లాయర్లు, టీచర్లు, విద్యార్థులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, మహిళలు, యువతపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రసిడెంట్ రవికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ జీర్గల్ నాగేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భుట్టో, కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, టీవీపీ నాయకులు బండారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలు రాజకీయ నాయకులు

రుణమాఫీ చేయాలి



ఊట్కూరు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

ఊట్కూరు: రైతులకు రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం నాయకుడు సలీం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో వడ్డీలేని రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఉచితంగా అందించాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణసౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేష్, ఎర్ర నర్సింహులు, చెన్నప్ప, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కోస్గి: గోవుల వల్ల కలిగే ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేసి గోవులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీహెచ్‌పీ కోస్గి శాఖ ఆధ్వర్యంలో 'గోరక్షణ..జన జాగరణ' పోస్టర్ ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు ఓ మతానికో, ఓ వర్గానికో సంబంధించినదని కాదని వివరించారు. గోవులను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు కృష్ణాగౌడ్, రాజేందర్ రావు, సుదర్శన్‌రెడ్డి, డాకూ బాల్‌రాజ్, బద్రీనాథ్, నరేష్, మల్లికార్జున్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

రూం టు రీడ్ సేవలు అభినందనీయం

మద్దూరు: పాఠశాలలో పేద విద్యార్థులకు చదువు కోసం కృషి చేస్తున్న రూం టూ రీడ్ సంస్థ సేవలు అభినందనీయమని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని నిడ్జింత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. అనంతరం సంస్థ ప్రతినిధులు సరిత, లక్ష్మణ్, లలితలు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా బాలిక విద్యా కార్యక్రమంలో భాగంగా సంస్థ దత్తత తీసుకున్న బాలికలకు జీవన నైపుణ్యాలు అందించడం, స్టేషనరీ సదుపాయం, 12వ తరగతి వరకు డ్రాప్ అవుట్ కాకుండా చూశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రఘు, సర్పంచ్ లావణ్య, మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

సారా ప్యాకెట్ల పట్టివేత

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ గ్రామంలో మంగళవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాటలక్ష్మి ప్రభుత్వ నిషేధిత నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం తెలియయడంతో వెంటనే ఆమె ఇంట్లో తనిఖీలు చేపట్టారు. 6.5లీటర్లు (32 ప్యాకెట్లు) గుడుంబా (నాటుసారా)ను గుర్తించారు. వెంటనే ఎక్సైజ్ పోలీసులకు అప్పగించి, కేసు దర్యాప్తుకు సూచించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

కోస్గి: పట్టణంలోని సూర్య ఆస్పత్రి ఎదుట మంగళవారం ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. ఆ సమయంలో రోడ్డుపై జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి నంబర్ లేని ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తునట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

మద్దూరు: ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి మంగళవారం పోలీసులు అప్పగించారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు సీఈఐఆర్ అప్లికేషన్‌లో అప్‌లై చేయగా ఐటీ కోర్ టీం ద్వార ఫోన్‌ను ట్రేస్ చేశామని బాధితుడి అందించినట్లు ఎస్‌ఐ శీనయ్య పేర్కొన్నారు. దీంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి సన్మానం

మద్దూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జూనియర్ కళాశాలకు చెందిన కావలి రేణుక 942 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి విద్యార్థి రేణుకను మెమెంటోతో సన్మానించారు. బాగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మద్దూరు: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేపీఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయరాములుకు వినతి పత్రం అందజేశారు. వానాకాలం సీజన్‌లోనే రైతుబంధు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయాలన్నారు. నర్సిములు, ఉసేనప్ప, ఆంజనేయులు, కొండప్ప, కిష్టప్ప, రాములు, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ముందు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, గుడ్లకు సంబంధించి చార్జీలను పెంచాలని కోరారు. సమయానికి బిల్లులు రాక అప్పులు చేసి కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని, స్థానికంగా మిడ్ డే మిల్స్ ఇన్‌చార్జ్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మరింత బాధాకరమని, ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసినా వాటిని అకౌంట్లకు వేయించడంలో ఆలస్యం చేస్తున్నారని వాపోయారు. జీఓ 8 ప్రకారం రూ.3వేల వేతనం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమల, సత్యమ్మ, భీమమ్మ, ఆంజనేయులు, కురుమూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మధ్యహ్న భోజన నిర్వహకులు..

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి



ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

మాగనూర్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పుస్తక పఠనం కోసం కేటాయించిన వ్యవసాయ కార్యాలయ భవనంలోని గదిని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వాడుకలో లేని భవనాలు రూ. 2 నుంచి 2.50 లక్షల వరకు ఖర్చులు చేసి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాగనూర్ సర్పంచ్ రాజు, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుధా, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

నర్వ: మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తునట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

నర్వ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జయరాములుశెట్టి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి మిషన్ భగీరథ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు మినహాయించి మిగిలిన శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో పై మూడు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జక్కన్నపల్లి, లక్కర్‌దొడ్డి, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు గోతులు పడ్డాయని కనీసం మట్టిని కొట్టుకునేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు పంచాయతీరాజ్ ఏఈ మారెప్పను కోరారు. ప్రత్యేక నిధులు ఏవి లేవని, ఎస్‌ఎఫ్‌సీ నిధుల నుంచి వాడుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా నామమాత్రంగా సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గంటలోపే సమావేశాన్ని ముగించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వీణావతి, తహసీల్దార్ రాజగణేష్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సభ్యులు